క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

డోన్ : అనారోగ్యానికి గురైన మండలంలోని యాపదిన్నె గ్రామానికి చెందిన పెద్దొడ్డి హైమావతికి సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.లక్ష చెక్కును ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్‌లు శనివారం అందజేశారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో ఆమె బంధువు తిమ్మారెడ్డికి ఈ చెక్కును వారు అందజేశారు.

సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

కొలిమిగుండ్ల: వాక్ ఫర్ ఫ్రీడమ్ కార్యక్రమంలో భాగంగా శనివారం చింతలాయిపల్లెలో సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సమత అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ బానిసత్వం లేని ప్రపంచాన్ని సాధ్యం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మానవ అక్రమ రవాణ, డ్రగ్స్ నిర్మూలన, లైంగిక దోపిడీ, వెట్టి చాకిరి, గృహహింస, బలవంతపు వివాహాలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరుస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అంబటి చంద్రమోహన్‌రెడ్డి, సమత సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రసన్న ఆంజనేయులు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో ఎక్కువ సామర్థ్యం గల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయాన్ని ప్రజలు గమనించాలన్నారు.

దూదేకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా దస్తగిరి



కోవెలకుంట్ల: దూదేకుల సంఘం నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా కోవెలకుంట్లకు చెందిన దస్తగిరిని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ బాజీ ఆదేశాల మేరకు కమిటీలో దస్తగిరి చోటు కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూదేకులను అన్ని రంగాల్లో బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని హజరత్ సయ్యద్ షా ఆహమ్మద్ బాషా ఖాద్రి శుత్తారియమని దర్గా ఉరుసు సందర్భంగా డాక్టర్ సయ్యద్ హుస్సేన్‌బాషా ఖాద్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెంగుళూరు శంకర కంటి వైద్యశాలకు చెందిన వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్‌లు చేయాల్సిన 46 మందిని బెంగుళూరులోని శంకర కంటి వైద్యశాలకు తీసుకెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలి

ప్యాపిలి: రెండు సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమౌళి, చిన్నపరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం అక్టోబర్ 19 వ తేదీ లోపు అన్ని రకాల బకాయిలను చెల్లించాలన్నారు. లేని పక్షంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 వ తేదీల్లో జిల్లా కేంద్రాల్లోచ ఆక్రందన దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ కార్యవర్గ సభ్యులు మద్దిలేటి, శ్రీనివాసులు, రామాంజనేయులు, మధుసూధన్, శివ తదితరులు పాల్గొన్నారు.

నరసింహయాదవ్ ఎంపికపై హర్షం

డోన్ టౌన్ : నంద్యాల జిల్లా డీసీసీ జిల్లా అధ్యక్షునిగా రెండవసారి జంగిటీ లక్ష్మీ నరసింహయాదవ్ ఎంపిక కావడంపై డోన్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఏమ్మార్పీ కార్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి లక్ష్మీ నరసింహయాదవ్ చేస్తున్న కృషి గుర్తించిన అధిష్టానం అధ్యక్షుడిగా రెండవసారి ఎంపిక చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ గార్లపాటి రామమద్దిలేటి, జనార్ధన్, రామభూపాల్, రాజశేఖర్,గోపినాథరావు తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల కాలం .. తప్పదు జాగ్రత్త !



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో జ్వరపీడితునికి వైద్యం చేస్తున్న ఏఎన్ఎం (ఫైల్)

డోన్ : సీజనల్ వ్యాధులు వెంటాడుతున్నాయి. ప్రత్యేకించి డెంగీ వణికిస్తుంది. అదేవిధంగా ఫ్లూ వైరస్, మలేరియా జ్వరాలు ప్రజలను పీడిస్తున్నాయి. ప్రస్తుతం డెంగీ జ్వరం డోన్ ప్రజలను వణికిస్తుంది. ఈ జ్వరానికి మూలం డెంగీ వైరస్. ఈడిస్ జాతి దోమకాటు వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ వైరస్ శరీరంలో ప్రవేశించిన వెంటనే కొందరికి తీవ్ర జ్వరం వస్తుంది. విపరీతంగా తలనొప్పి, కళ్ల వెనకాల నొప్పి, వాంతి, వికారం, ఒళ్లు, నడుము, కీళ్ల నొప్పులు రావచ్చు. ఆకలి తగ్గిపోయి కడుపునొప్పి, ఆయాసం, పొట్టలో లేదా ఛాతిలో నీరు చేరడం, చిగుర్ల నుండి రక్తం కారడం కూడా సంభవించవచ్చు. చర్మంపైన ఒక్కొక్కసారి ఎర్రటి చుక్కల్లాంటి మచ్చలు కనిపించవచ్చు. ఈ డెంగీ జ్వరం ఒక్కొక్కసారి పారాసిటమాల్ మాత్రతోనే తగ్గిపోతుంది. ఒక్కొక్కసారి ఐదు, ఆరు రోజుల వరకు మనిషిని హింసిస్తుంది. ఏదిఏమైనా జాగ్రత్త తప్పదు అంటున్నారు వైద్యులు. అయితే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య రక్ష కార్యక్రమం జ్వర పీడితులకు ఎంతో ఉపయోగపడుంది. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన హెల్త్ క్యాంపుల్లోనూ ఎక్కువ మంది జ్వరానికి చికిత్సలు చేయించుకున్నట్లు వైద్యులు తెలిపారు.

అతిగా ఆలోచించవద్దు : డెంగీ జ్వరం అనగానే మనం ప్లేట్‌లెట్ల గురించి ఆలోచిస్తాం. ప్లేట్‌లెట్ల సంఖ్య అంత ముఖ్యం కాదని ప్రతిఒక్కరూ గమనించాలి అంటున్నారు వైద్యులు. అయితే వీటి సంఖ్య 20వేల కన్నా తగ్గిపోయి రక్తస్రావ లక్షణాలు కనిపిస్తే ప్లేట్‌లెట్‌లను ఎక్కించాల్సిన అవసరం ఉంది. కొంతమంది 40వేలకు 30వేలకు ప్లేట్‌లెట్లు పడిపోయాయని అనవసరంగా గాభరా పడిపోయి వైద్యులను ఆశ్రయిస్తుంటారు. 10వేల ప్లేట్‌లెట్ల సంఖ్య శరీరానికి సరిపోతాయనే విషయాన్ని గమనించాలని సూచిస్తున్నారు వైద్యులు.

ఫ్లూపై జాగ్రత్త అవసరం : ఫ్లూ వైరస్ మూలంగా ముక్కు, గొంతు, ఊపిరితిత్తులు ఇన్‌ఫెక్షన్‌కు దారితీస్తాయి. పిల్లలు, వృద్ధులతో పాటు రోగనిరోధక శక్తి తక్కువగా ఉండేవారిలో ఫ్లూ అధికంగా కనిపిస్తుంది. జ్వరం 101 కన్నా అధికంగా ఉండే అవకాశం ఉంటుంది. ఒళ్లు నొప్పులు కూడా అధికంగా ఉంటాయి. ఈ ఫ్లూ జ్వరం తగ్గడానికి పారాసిటమాల్ మాత్ర వేసుకోవడంతో పాటు ద్రవాలు ఎక్కువగా తీసుకోవడం, విశ్రాంతి తీసుకోవడం చేయాల్సి ఉంటుంది. మూడు, నాలుగు రోజులుగా ఇబ్బందులు పెడుతుంటే సమీపంలోని వైద్యున్ని సంప్రదిస్తే సరిపోతుంది. అయితే దగ్గు, ఆయాసం ఎక్కువగా ఉండటం, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదిస్తే మంచిది. మలేరియా జ్వరాన్ని నిర్లక్ష్యం చేయొద్దంటున్నారు వైద్యులు.

వైద్యులను సంప్రదించడం మేలు

జ్వరం, ఒళ్లునొప్పులు, జలుబు, దగ్గు వచ్చినప్పుడు ఏ మందులు పడితే ఆ మందులు రోగులు వినియోగించరాదు. వైద్యులను సంప్రదించడం మేలు. అనవసరంగా కొంతమంది ఆంటీబయోటిక్ మందులు వినియోగిస్తారు. ఇది సరైన పద్ధతి కాదు. రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. ఫ్లూ, మలేరియా, డెంగీ లాంటి జ్వర పీడితులు డాక్టర్ సలహామేరకు మందులు వినియోగిస్తూ త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ రమ్యశిల్ప, ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు, డోన్.

● జోరుగా జొన్న సాగు



ట్రాక్టర్‌తో జొన్న విత్తనం వేస్తున్న రైతన్న

బనగానపల్లె : రబీ సీజన్‌లో రైతులు జోరుగా జొన్న సాగు చేపట్టారు. ప్రత్యేకించి మహేంద్ర జొన్నను అధికంగా సాగు చేస్తున్నారు. బనగానపల్లె నియోజక వర్గంలో సాధారణ జొన్న విత్తనసాగు 21వేల హెక్టార్లు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. వారం రోజులుగా జొన్న విత్తనసాగు ప్రారంభమైంది. ఈ నెల చివర వరకు విత్తన వేసుకోవచ్చని అధికారులు తెలిపారు. గతేడాది జొన్న మంచిదిగుబడితోపాటు గిట్టుబాటు ధర లభించింది. దీంతో జొన్నను సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుత క్వింటాం రూ.3200 – 3300 వరకు ఉంది. ఈ ధర గిట్టుబాటుగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కొండమీదపల్లెలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను శనివారం డీఈ మన్మథబాబుతో కలిసి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పరిశీలించారు. 600 అడుగుల ఎత్తులో ఉన్న కొండపై ఉన్న ఈ గ్రామానికి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2021లో కింద నుంచి కొండపైకి రూ.97 లక్షలతో తారురోడ్డు నిర్మించారు. గ్రామస్తులు రాక పోకలు సాగించే సమయంలో రోడ్డుకు ఒక వైపు కొండ, మరోక వైపు లోతట్టు ప్రాంతం ఉండటంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో జెడ్పీ చైర్మన్ ప్రత్యేక చొరవతో రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. కొండపై నుంచి కింద వరకు ప్లాక్లెయినర్‌తో కొండను 15 అడుగుల మేర తొలిచి విస్తరించే పనులు చేస్తున్నారు. లోతట్టు వైపు మట్టిని వదలడంతో పాటు అక్కడక్కడ రక్షణ గోడ నిర్మించనున్నారు. ఇప్పటికే సగానికిపైగానే పనులు పూర్తయింది. రోడ్డు విస్తరణ పనులు చేసి వర్షపునీరు రోడ్డుపైకి రాకుండా కాల్వలు నిర్మిస్తున్నట్లు ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ చెప్పారు. రోడ్డును పూర్తిస్థాయిలో వెడల్పు చేసి సౌకర్యంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో కొండమీదపల్లెకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకం కింద చేపడుతున్న రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామంలో శనివారం రైతులతో గ్రామ సభ నిర్వహించారు. సభలో రీ సర్వే వివరాలు తెలిపిన తహసీల్దార్ రైతులు తమ భూములకు సంబంధించిన విస్తీర్ణాన్ని నిర్ధారించుకోవాని సూచించారు. ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే భూ కమతాలపై సర్వే రాళ్లు పాతించడమే కాకుండా, భూ హక్కు పత్రాలు కూడా మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ సత్యదీప్, మండల సర్వేయర్ జ్యోత్స్న రాణి, ఉప సర్పంచ్ సుధాకరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు చలపతి రెడ్డి, వెంకిరెడ్డి, హేమనాథ్‌రెడ్డి, వీఆర్వో వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్ గీత

డోన్ : రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా పోటీలకు డోన్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గీత, ఫిజికల్ డైరెక్టర్ స్వరూపరాణి తెలిపారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు నిశిత, ఆశాజ్యోతి, ఫెన్సింగ్ క్రీడలకు స్వరూప, కుసుమాంజలి, ఆర్చరీ క్రీడలకు సలోమి, జుడో పోటీలకు రిశిత, స్రవంతి, మణివసంత, మానస, దీపిక, స్నేహలత, సుప్రియ, డిస్కస్ త్రో పోటీలకు స్మృతి, కరాటే పోటీలకు దీపిక, హారిక, 200 మీటర్ల హర్డిల్స్ పరుగు పోటీలకు ఆనందమ్మ ఎంపికయ్యారని వివరించారు.

జోరుగా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు



విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

బేతంచెర్ల: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో మండల పరిధిలోని గూటుపల్లె హుసేనాపురం, తవిసికొండ, రహిమానుపురం, నాగమళ్లకుంట గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి రూ. 3 కోట్లతో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైంది. గూటుపల్లె గ్రామ సమీపాన సబ్ స్టేషన్‌కు స్థలం కేటాయించడంతో నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయితే గూటుపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలోని గ్రామాలకు లోఓల్టేజీ సమస్య పరిష్కారం కానుంది.

శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి



ఉత్సవాల బుక్‌లెట్లను విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం నుంచి నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఉత్సవాల బుక్‌లెట్లను విడుదల చేశా రు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 10 రోజులపాటు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ప్రతి రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

మారెమ్మ ఆలయంలో...

స్థానిక అంకాలమ్మ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన మారెమ్మ ఆలయంలో ఆదివారం నుంచి దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓసేనప్ప, మైకేల్ తెలిపారు. అమ్మవారు మొదటి రోజు బాలత్రిపుర సుందరీదేవిగా, 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణాదేవి, 18న మహాలక్ష్మీదేవి, 19న మారెమ్మదేవి, 20న సరస్వతీదేవి, 21న లలితా త్రిపుర సుందరీదేవి, 22న దుర్గాదేవి, 23న మహిషాసురమర్ధినిదేవి, రాజరాజేశ్వరీదేవి అలంకారాలోల దర్శనమిస్తారన్నారు.

ప్యాపిలి: స్థానిక శ్రీమత్కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. నిర్వాహకులు ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజైన ఆదివారం ఉదయం పతాక ఆవిష్కరణ, గణపతిపూజ, పుణ్యాహవచనం, చండీ అవాహన, నవగ్రహ పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం బిందె సేవ, మహామంగళ హారతి, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు అమ్మవారు స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా దర్శనమివ్వనున్నట్లు వారు తెలిపారు.



బుగ్గర అర్జున్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేసిన ఆర్యవైశ్యులు

బేతంచెర్ల: మండల కేంద్రమైన బేతంచెర్లలో అమ్మవారిశాలలో వెలసిన వాసవీ కన్యాకపరమేశ్వరి, దుర్గాపేటలో వెలసిన మహిశాసుర మర్ధిని ఆలయం, కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరీ మాత ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఆదివారం నవరాత్రి ఉత్సవాలు ముగిసేంత వరకు ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీమద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో దసరా నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

దసరా నవరాత్రి ఉత్సవాలకు మంత్రి తనయుడిని ఆహ్వానించి

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దసరా నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు అర్జున్ రెడ్డికి ఆర్యవైశ్యులు శనివారం ఆహ్వానించారు. పట్టణంలోని మంత్రి బుగ్గన స్వగృహంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కంద గడ్డల మోహన్‌రావు, గురవయ్య, ట్రెజరర్ గుండా జయచంద్రయ్య ఆధ్వర్యంలో బుగ్గర అర్జున్ రెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం అర్జున్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు కొప్పరపు శేషమోహన్, లక్ష్మీనారయణ, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడుబావి వీరాంజనేయస్వామి, గౌరి పేటలో వెలసిన ఆంజనేయ స్వామి, పలక చింత మాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయాల్లో భాద్రపద మాస అమావాస్య శనివారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ, మహామంగళహారతి నిర్వహించారు. బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ ఆలయంలో నిర్వాహకులు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు.

వైభవంగా గురుపీఠాహోరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల పుణ్యక్షేత్రంలో అమ్మ నీదయ ఆశ్రమ ట్రస్ట్ పీఠాధిపతిగా అశోక్ గురుజీ గురుపీఠాహోరణ కార్యక్రమానాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీశైలం కొత్తపేట సమీపంలోని అమ్మ నీదయ ఆశ్రమంలో అధ్యక్షుడు నర్సిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా ప్రత్యేక హోమాది కార్యక్రమాలను నిర్వహించి, పంచద్రవ్య ప్రాశన చేసి, గురు పూజ నిర్వహించి అశోక్ గురుజీని ముఖద్వారం నుంచి మహాస్వాగతంతో ఆశ్రమంలోకి తీసుకొచ్చారు. ఆశ్రమం తరపున మహాలయ అమావాస్యను పురస్కరించుకుని శ్రీశైలంలోని ఆశ్రమంలో వేదగోష, పుణ్యాహవాచనం, గణపతి హోమం, మహారుద్ర హోమం, పాశుపత హోమం, శ్రీగురుహోమం చేపట్టారు.

ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి దేవీశరన్నవరాత్రి మహోత్సవాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

బనగానపల్లె రూరల్ : దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గాథంశెట్టివేణుగోపాల్, సెక్రటరీ డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొండపేట శ్రీవాసవీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం నుంచి ప్రారంభమయ్యే మహోత్సవాల్లో పాల్గొనాలని ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ దసరా ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు శ్రీరామసుబ్రమణ్యం, గుండారవికుమార్, చక్రపాణి, నూకల వెంకటసుబ్బయ్య, ఎస్ వెంకటేశ్వర్లు, పీఎస్ఎస్ నారాయణ, శివయ్య, వంకదారి రవీంద్ర, కేతేపల్లి శివచంద్రయ్య, ఫణిభూషణ్ సతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు

డోన్ టౌన్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అమ్మవార్ల ఆలాయలను నిర్వాహకులు ముస్తాబు చేశారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొలువైన లక్ష్మీదేవి తిరుచానూరు పద్మావతి అమ్మవారు పోలిక అని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ తెలిపారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని విద్యా లక్ష్మీ, ధైర్య లక్ష్మీ,సంతానలక్ష్మీ,గజలక్ష్మీ రూపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

శరవేగంగా వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు



రామకృష్ణాపురంలో 60 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ట్యాంక్

బనగానపల్లె రూరల్ : మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నా గత టీడీపీ పాలనలో పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం గ్రామంలో శాశ్వత నీటి పరిష్కారానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో జల్‌జీవన్ పథకం కింద 60వేల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్‌ఆర్ నిర్మాణానికి రూ.43.95లక్షల నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు చేపట్టిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. నెల రోజుల్లో ఈ ట్యాంకు నిర్మాణ పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



అమరసాని కృష్ణ(ఫైల్)

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలం కంపమల్ల మెట్ట సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ మౌలానీ అందించిన సమాచారం మేరకు.. దొర్నిపాడుకు చెందిన యువకుడు అమరసాని కృష్ణ(27) సొంత పనుల నిమిత్తం డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి బైక్‌పై వెళ్లి స్వగ్రామానికి బయలదేరాడు. కంపమల్ల సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు కల్వర్టును ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాద వివరాలపై ఆరా తీస్తున్నారు. మృతునికి భార్య జ్యోతి, కుమారుడు రుత్విక్ రాయల్, కుమార్తె శరణ్య ఉన్నారు. ఇదిలా ఉండగా మృతి చెందిన యువకుడి తండ్రి అమరసాని నారాయణ పదిహేను రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. పదిహేను రోజుల వ్యవధిలో తండ్రి, కుమారుడు మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో విషాధ చాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్: పట్టణంలో వేర్వేరు చోట్ల శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. గుత్తి రోడ్డులోని రుద్రాక్ష గుట్ట వద్ద నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో సమీపంలో ఓబులాపురం గ్రామానికి చెందిన బలిజ సుధాకర్ బైకుపై వస్తుండగా ఎదురుగా వస్తున్న సైకిల్‌ను తప్పించ బోయి కింద పడ్డాడు.ఈ ప్రమాదంలో సుధాకర్ కాలుకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అలాగే పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని బోలేరో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పట్టణానికి చెందిన మధు గాయపడడంతో 108 వాహనంలో డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిద్దరిని ప్రథమ చికిత్సల అనంతరం కర్నూలుకు తరలించారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లిపై కొడుకు కత్తితో దాడి

డోన్ టౌన్ : పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన ఎరుకలి మద్దమ్మపై శనివారం రాత్రి కుమారుడు సురేష్ తాగిన మైకంలో కత్తితో దాడి చేశాడు. మద్యానికి భానిసైన సురేష్ తరుచూ తల్లితో గొడవ పడుతూ ఉండేవాడు. ఈ కోవలోనే శనివారం మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తల్లితో గొడవ పెట్టుకున్నాడు. తల్లి డబ్బులు ఇవ్వకపోవడంతో క్షణికావేశానికి గురైన కుమారుడు ఇంట్లో ఉన్న కత్తితో దాడి చేశాడు. అయితే తల్లి చేతులు అడ్డుపెట్టుకోవడంతో గాయాలయ్యాయి. స్థానికులు డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మద్దమ్మను కర్నూలు వైద్యశాలకు తరలించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం బోల్తా వ్యక్తికి గాయాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా గ్రామ సమీపాన ఉన్న శివాలయం వద్ద శనివారం రాత్రి ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం బోల్తాపడిన సంఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ప్యాపిలి మండలం పీఆర్‌పల్లె గ్రామానికి చెందిన పురుషోత్తం రెడ్డి బేతంచెర్ల మండల పరిధిలోని సిమెంట్ నగర్‌లోని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికునిగా విధులు నిర్వహిస్తున్నాడు. పీఆర్‌పల్లెకు ద్విచక్రవాహణంపై వెళ్లి వస్తుండగా బుగ్గానిపల్లె తండా సమీపాన ఉన్న శివాలయం వద్ద బోల్తా పడింది. పురుషోత్తం రెడ్డి తలకు తీవ్రగాయాలు కావడంతో బాధితుని చికిత్స నిమిత్తం శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు.

బైకు యాత్రకు ఘన స్వాగతం



బైకు యాత్రకు స్వాగతం పలుకుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

డోన్ టౌన్ : అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సీఆర్‌పీఎఫ్ మహిళా జవాన్లు చేపట్టిన బైకు యాత్ర శనివారం డోన్‌కు చేరుకుంది. బైక్ యాత్రకు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, ప్రజలు స్వాగతం పలికారు. పట్టణంలోని ప్రధాన రహదారి వెంట బైకు ర్యాలీ సాగింది. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో బైక్ యాత్రికులకు తేనీటి విందు ఇచ్చారు.ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ జవాన్లు మాట్లాడుతూ దేశ ప్రజలకు మహిళా శక్తి గురించి తెలియజేసేందుకు బైకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 3వ తేదీన కన్యాకుమారీలో ప్రారంభమైన ఈ యాత్ర 31వ తేదీ గుజరాత్ చేరుకోవడంతో ముగుస్తుందన్నారు. అనంతరం కర్నూలుకు బయలుదేరి వెళ్లారు.